

22,650 క్యూసెక్కుల వరద జలాలు

సోమశిల: జలాశయానికి మంగళవారం 16,15 0 క్యూసెక్కుల జలాలు వస్తున్నా యి. 7, 8 క్రస్ట్‌గేట్ల ద్వారా 22, 650 క్యూసెక్కులు పెన్నానదికి విడుదల చేస్తున్నామని తెలిపారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,23,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,149
మూడు శాతం జీఎస్టీతో	రూ.11,483
సవర (8 గ్రాములు)	రూ.91,864

గరిష్టం/కనిష్టం
37.3 /24.8

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉరుములు, మెరుపులతో వాతావరణం మేఘావృతంగా ఉంటుంది. మంగళవారం 13.8 మి.మీ. వర్షం కురిసింది. గాలిలో తేమ 98 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

మాజీ ఉపరాష్ట్రపతితో కలెక్టర్ మర్యాద పూర్వక భేటీ



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును కలిసిన కలెక్టర్ హిమాన్షు శుక్లా

వెంకటాచలం: మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జిల్లా పర్యటనలో భాగంగా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో పరిస్థితులు, పాలనాంశాలు, ఇతర అంశాలపై కొద్ది సేపు చర్చించారు.

జగన్ సమీక్షలో కాకాణి



సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి కాకాణి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రీజనల్ కో ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరాలను కట్టడి చేయాలి

- పోలీసు అధికారులను ఆదేశించిన ఐజీ



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ

నెల్లూరు (క్రైమ్): నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలు అందించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఆయన ఎస్పీ అజితతో కలిసి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. రౌడీషీటర్లను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించరాదని, వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. గంజాయిని పూర్తిగా కట్టడి చేయాలని, మహిళలు, చిన్నారుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని, వాటి ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను విశ్లేషించి బ్లాక్ స్పాట్‌ల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై కోర్టు హాల్‌లో న్యాయవాది షూ విసిరిన ఘటనను ఖండిస్తూ బుధవారం కోర్టు విధులను బహిష్కరిస్తున్నామని బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అయ్యప్ప రెడ్డి, నాగరాజయాదవ్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన అమానవీయ ఘటన పూర్తిగా న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ అందుకు నిరసనగా బుధవారం కోర్టు విధులను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 76,773 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,100 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టైంస్లాట్ దర్శన టికెట్లు లేని వారికి 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

రక్త చరిత్ర

వణుకు పుట్టిస్తున్న నరమేధం



ఘటనా స్థలంలో హతుల చెప్పులు, రక్తమడుగులు



పోలీస్ జాగిలాలతో

- అదుపు తప్పిన శాంతిభద్రతలు
- గంజాయి, మద్యం మత్తే కారణాలు
- ఐదు రోజుల్లో ఐదు హత్యలు
- వివాహేతర సంబంధాల నేపథ్యంలో కందుకూరులో కారుతో ఢీకొట్టి ఒకరి హతమార్చి..
- కొండాపురంలో మరొకరిని చంపేసి.. ఉరేసిన వైనం
- మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి కొడుకును పొట్టన పెట్టుకున్న తండ్రి
- ప్రాణాలు తీసి రాళ్లపాడు ప్రాజెక్ట్‌లో పడేసిన మరో ఘటన
- తాజాగా ఇద్దరిని కబళించి జాఫర్‌సాహెబ్ కాలువలో పడేసిన వైనం
- మర్డర్లతో అట్టుడుకుతున్న నెల్లూరు

పచ్చని భూములు. గలగల పారే కాలువలు. పాడి పంటలతో అలరారే చారిత్రత్మాక సింహపురి.. కొత్తగా రక్త చరిత్రను లిఖిస్తోంది. గడిచిన ఏడాది కాలంగా నెల్లూరులో జరిగిన మారణహోమాలు ఇందుకు దర్పణం. శాంతి భద్రతలను పరి రక్షించాల్సిన పోలీసులు తమ విధులను గాలికి వదిలేశారు. నేరస్తులపై నిఘా లేకపోవడం, గంజాయి, మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతుండడంతో నేరస్తులు నరమేధం సృష్టిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి మారుమూల ప్రాంతాల వరకు నేరప్రవృత్తి పేట్రేగి పోతోంది. జిల్లాలో జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దాడుల్లో అధిక శాతం గంజాయి, మద్యం మత్తులోనే జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. అక్టోబరు నెలలో ఐదు రోజులోనే ఐదు హత్యలు నేరాల తీవ్రతకు అద్దం పడుతోంది.


సాక్షిప్రతినిధి నెల్లూరు: జిల్లాలో పోలీసు వ్యవస్థ చేవ కోల్పోయింది. జిల్లాలో పనిచేసిన కొందరు పోలీస్ బాస్‌ల హయాంలో పోలీస్ వ్యవస్థ అత్యంత శక్తి వంతంగా ఉండేది. అప్పట్లో నేరాలకు పాల్పడే వారిని ఉక్కుపాదంలో నలిపేశారు. నేరాలకు పాల్పడాలంటే భయపడి జిల్లానే వదిలేసి వెళ్లిపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అటువంటి ఖాకీలు ఇప్పుడు పచ్చపార్టీ నేతలకు ఊడిగం చేస్తుండడంతో శాంతిభద్రతలు అదుపు తప్పాయి. హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, దొంగతనాలు నిత్యకృత్యంగా మారాయి. ఈ నెలలో ఐదు రోజుల వ్యవధిలో ఐదు హత్యలు జరిగాయంటే పరిస్థితి తీవ్రత ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. శాంతిభద్రతలు లోపించడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గస్తీకి సుస్తీ.. నేరస్తులకు హ్యాపీ

జిల్లాలో ఐదు సబ్‌డివిజన్లు, 12 సర్కిల్స్ పరిధిలో 52 పోలీసుస్టేషన్‌లు, 11 అర్బన్ పోలీసుస్టేషన్‌లు ఉన్నాయి. వాటి పరిధిలో కొద్ది కాలంగా పోలీసు గస్తీ అంతంత మాత్రంగానే మారడంతో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతోంది. పాతనేరస్తులు, అసాంఘిక శక్తుల ఆగడాలు శృతిమించుతున్నాయి. పాత కక్షల నేపథ్యంలో ఒకరు.. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంకొకరు.. ఇతరత్రా కారణాలతో మరొకరు ప్రత్యర్థులను హత్యచేస్తున్నారు. మానవత్వం, బంధుత్వం, కుటుంబ భవబంధాలు చూడకుండా అడ్డొచ్చిన వారిని అతి కిరాతకంగా హత్య చేస్తున్నారు. పగలు, ప్రతీకారాలతో భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. జిల్లాలో కిరాయి సంస్కృతి పెరుగుతోంది. సుఫారి తీసుకుని ప్రత్యర్థులను అతి కిరాతకంగా హత్య చేస్తున్నారు. ఇతర జిల్లాలోనూ నేరాలకు పాల్పడుతున్నారు.

మత్తులోనే విశృంఖలంగా నేరాలు

జిల్లాలో మద్యం ఎరులై పారుతోంది. గంజాయి విక్రయాలు చాపకింద నీరులా సాగుతోన్నాయి. మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసైన యువత విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారు. వ్యసనాలను తీర్చుకునేందుకు సరిపడా నగదు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఒంటరిగా వెళ్లేవారిని కత్తులతో బెదిరించి అందినకాడికి దోచుకోవడం, ఎదురు తిరిగిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. ఈ పరిణామాలతో ప్రజలు ఇళ్ల విడిచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. నెల్లూరు నగరంలో పరిస్థితి మరింత ఆందోళన కరంగా మారుతోంది. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నారు. పది నెలల వ్యవధిలో సుమారు 18కు పైగా హత్యలు జరిగాయంటే శాంతిభద్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో అవగత మవుతోంది.





హత్యలు జరిగిన ప్రదేశంలో పనిచేయని సీసీ కెమెరాలు



ఘటనా స్థలంలో విచారిస్తున్న డీఎస్పీ సింధుప్రియ

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపైనే శ్రద్ధ

శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో తలమునకలయ్యారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న ప్రతిపక్ష నేతలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో నేరస్తులు, అసాంఘిక శక్తులు విజృంభిస్తున్నారు. దీంతో నేరస్తులు చెలరేగిపోతున్నారు. అయితే పోలీసులు మాత్రం ప్రజల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నామనీ, బీట్‌లు పెంచామనీ, డ్రోన్లతో నిఘా పెట్టామని చెబుతున్నప్పటికి ఏ మాత్రం తగినంత భరోసా దొరకడం లేదు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్టోబర్ 2వ తేదీ

గుడ్లూరు మండలం దారకానిపాడుకు చెందిన కాకర్ల హరిచంద్రప్రసాద్ అలియాస్ నాయుడు అదే గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు (25) చిన్నప్పటి నుంచి ప్రాణ స్నేహితులు. ఈ క్రమంలో హరిచంద్రప్రసాద్ లక్ష్మీనాయుడు భార్యతో వివాహేతర సంబంధాన్ని ఏర్పర్చుకున్నాడు. ఈ వ్యవహారంలో తన పరువు పోయిందని భావించిన హరిచంద్రప్రసాద్.. లక్ష్మీనాయుడిపై కక్ష పెంచుకున్నాడు. దసరా పండగ రోజు లక్ష్మీనాయుడు బైక్‌పై వెళ్తుండగా కారును ఢీకొట్టించి హత్య చేశాడు.

- కొండాపురం మండలం సాయిపేట బీసీ కాలనీకి చెందిన బండారు సుధాకర్ (51) అదే గ్రామానికి చెందిన సానంగుల రవితో సుధాకర్ భార్య మల్లేశ్వరితో వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో ఆమె అన్న తురకా మాధవ, సునీత, లక్ష్మీకాంతమ్మ, వేణు మరికొందరితో కలిసి సుధాకర్‌ను హత్య చేసి ఉరేసి చంపేశారు.

అక్టోబర్ 3వ తేదీ

విడవలూరు మండలం ముదివర్తిలో జరిగింది. గ్రామ బీసీ కాలనీకి చెందిన తాండ్ర రవికుమార్ మద్యం తాగొచ్చి భార్య సుప్రజతో నిత్యం గొడవలు పడుతూ ఉండడంతో కొడుకు ప్రేమ్‌చంద్ తన తల్లి సుప్రజకు అండగా ఉంటూ తండ్రిని మందలిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో కుమారుడు ప్రేమ్‌చంద్ ఇంట్లో పడుకొని నిద్ర పోతున్న సమయంలో రవికుమార్ ఇంటికి వచ్చి నిద్రపోతున్న కొడుకు ప్రేమ్‌చంద్‌పై రోకలి బండతో కొట్టి హత్య చేశాడు.

అక్టోబర్ 4వ తేదీ

లింగసముద్రం మండల పరిధిలోని రాళ్లపాడు ప్రాజెక్ట్‌లో గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి శవాన్ని ప్రాజెక్ట్‌లో పడేశారు. అతను ఎవరనే విషయం కూడా పోలీసులకు ఆధారాలు సేకరించలేకపోయారు. మృతుడి ఒంటిపై గాయాలు ఉండడంతో అతన్ని హత్య చేశారనేది స్పష్టం.

అక్టోబర్ 6వ తేదీ

నెల్లూరు నగరం వేకువ జామునే ఉలికి పడింది. పవిత్రమైన పినాకిని తీరంలోని బ్యారేజ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులను అత్యంత కిరాతకంగా హత్య చేసి మృతదేహాలను జాఫర్ సాహెబ్‌కాలువలో పడవేశారు.

ఏడాది కాలంలో జిల్లాలో ఘటనలు మచ్చుకు కొన్ని..

- నెల్లూరు ప్రగతినగర్‌లో గంజాయి, మద్యం మత్తులో కొందరు యువకులు కారు డ్రైవర్‌ను అతి కిరాతకంగా హత్య చేశారు.
- ముత్తుకూరు బస్టాండ్ వద్ద గంజాయి మత్తులో ఇద్దరు యువకులు ఓ మహిళను చంపుతామని బెదిరించి రెండు సెల్‌ఫోన్లను దోచుకెళ్లారు.
- తల్పగిరికాలనీ వద్ద నాగేంద్రను కత్తులతో చంపుతామని బెదిరించి అతని ఫోన్‌పే నుంచి రూ.5 వేల నగదును దుండగులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు.
- టిఫిన్ విషయంలో మాటామాటా పెరిగి టెంపో ట్రావెల్స్ నిర్వాహకుడు అల్లాభక్షును మత్తులో ఉన్న రంగనాయకులపేటకు చెందిన షేక్ ఇషాక్ హత్య చేశాడు.
- మద్యం మత్తులో మాటామాటా పెరగడంతో సుల్తాన్ అనే వ్యక్తిని ఇద్దరు హత్య చేశారు. గంజాయి మత్తులో ఉన్న కొందరు నెల్లూరు సుజాతమ్మకాలనీలోని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి విధ్వంసం సృష్టించారు.
- మత్తులో ఉన్న ముగ్గురు యువకులు రైల్వే స్టేషన్ వద్ద బైక్‌పై వెళుతున్న బ్యాంకు ఉద్యోగిని చంపుతామని కత్తులతో బెదిరించి నగదు దోచుకున్నారు.
- ఇటీవల నెల్లూరు నగరంలోని అయ్యప్ప గుడి సెంటర్‌లో ఓ యువకుడు హోటల్ కెళ్లి టిఫన్ ఆర్డర్ ఇచ్చాడు. తనకంటే వెనకున్న ఓ వ్యక్తి ఆర్డర్ ఇచ్చారు. ముందుగా తాను టిఫిన్ ఆర్డర్ ఇచ్చినా వెనకొచ్చిన వ్యక్తికి ఇచ్చాడని కారణంతో ఇద్దరు మధ్య జరిగిన చిన్న వివాదంతో దారుణంగా కత్తితో పొడిచి చంపాడు.
- నెల్లూరు రామలింగాపురం రైల్వే బ్రిడ్జి సమీపంలో రౌడీషీటర్ కత్తి రవి (32)ని దారుణంగా హత్య చేసిన నిందితులు.
- ఆర్థిక విభేదాల నేపథ్యంలో ముత్యాలపాళెంలో ఎం.పాల్ (35)ను దారుణంగా హత్య చేసిన నిందితులు.
- కొండాపురం మండలంలో తిరుపాల్ (55) అనే వ్యక్తిని దారుణంగా హత్య చేసి 25 మేకలను అపహరించుకెళ్లారు.
- ఉదయగిరిలో జనం చూస్తుండగానే వరుసకు బావను బావమరుదులే హత్య చేశారు. ఆస్తి తగాదాలే కారణం.
- కలువాయి మండలంలోని పల్లంకొండలో గోపి అనే యువకుడు దారుణ హత్యకు గురైయ్యాడు.
- కొడవలూరు మండలం టపాతోపు వద్ద హిజ్రా నాయకురాలు హాసినీని ప్రత్యర్థులు దారుణంగా చంపారు
- కొడవలూరు మండలం మిక్కిలింపేట వద్ద బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన స్టీల్‌వ్యాపారి రమేష్ హత్యకు గురైయ్యాడు.
- నెల్లూరు ఉడ్‌హౌస్ సంఘంలో సస్పెక్ట్ షీటర్ కళ్యాణ్‌ను పాతకక్షల నేపథ్యంలో హత్య చేసిన దుండగులు.
- ఇందిరాగాంధీనగర్‌లో రౌడీషీటర్ సుజనకృష్ణ అలియాస్ చింటూను స్నేహితులే కిరాతకంగా హత్య చేశారు.
- తాజాగా జాకీర్ హుస్సేన్‌నగర్ న్యూకాలనీలో మద్యం మత్తులో దూషించాడని భర్త శ్రీనివాసకుమార్‌ను హత్య చేసిన భార్య.

మహోన్నతుడు మహర్షి వాల్మీకి



మాట్లాడుతున్న జేసీ మొగిలి వెంకటేశ్వర్లు

- జేసీ మొగిలి వెంకటేశ్వర్లు

నెల్లూరురూరల్: భారతీయ సంస్కృతి, నీతి, ధర్మం, సత్యం, కరుణ వంటి విలువలతో కూడిన అత్యద్భుతమైన రామాయణ మహా కావ్యాన్ని ప్రపంచానికి అందించిన మహోన్నతుడు మహర్షి వాల్మీకి అని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అధికారులు, బీసీ సంఘాల నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి, వాల్మీకి మహర్షి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ వాల్మీకి జీవిత విశేషాలను వివరించారు. జేసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానవుడి జీవన విధానానికి, ధర్మ పాలనకు నిలువెత్తు సాక్షాత్కారం రామాయణమని, 23 వేల శ్లోకాలతో, ఏడు ఖండాలతో రామాయణ పవిత్ర మహాకావ్యాన్ని మనకు అందించిన గొప్ప మహర్షి వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని, సాధారణ మనిషి నుంచి ఒక మహా ఋషిగా ఎదిగి, మనుషులు మహా ఋషులవుతారని నిరూపించిన వాల్మీకి జీవిత చరిత్ర ఒక ఉదాహరణ అన్నారు. బీసీ సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు నగరంలో బీసీ భవన్ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. నగరంలో వాల్మీకి మహర్షి విగ్రహం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు మొదలైన బీసీ సంఘాల నేతలు సూచించిన పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయ్‌కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెంచల బాబు యాదవ్, బీసీ సంక్షేమ సంఘ నాయకులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, దేవరాల సుబ్రహ్మణ్యం, బీసీ కోటయ్య, జనార్దన్, కాలేషా, బుధవారపు బాలాజీ, పీఎల్ రావు, మురళీకృష్ణ, వసతిగృహ సంక్షేమ అధికారులు, పలు బీసీ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు న్యాయం చేస్తాం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా

కందుకూరు: ఇండోసోల్ కంపెనీ కోసం భూములిచ్చిన రైతులను ఆదుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. భూములిచ్చిన రైతులతో మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీ భూసేకరణలో భూములు కోల్పోతున్న ఉప్పరపాళెం, రామకృష్ణాపురం, ఉలవపాడు, చేవూరు, రావూరు, కరేడు గ్రామాల రైతులతో మాట్లాడుతామన్నారు. రైతుల అభిప్రాయాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. జిల్లా స్థాయి నెగోషియేషన్ కమిటీ ద్వారా భూములిచ్చిన రైతులకు ఎంత మేర నగదు చెల్లించాల్సి ఉందో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ హిమవంశీ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రాజశేఖర్, ఏపీఎంబీపీ జోనల్ మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం



పార్టీ నేతలు, కార్యకర్తలతో మేకపాటి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ విజయకేతనం ఎగుర వేసేందుకు క్యాడర్ సమాయత్తం కావాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికార టీడీపీ కుయుక్తలు, కుతంత్రాలు, కుట్రలతో స్థానిక ఎన్నికల్లో నెగ్గే ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. అధికార కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేకత పెరుగుతున్నందున, మనకు సానుకూలంగా ఓటర్లను మలచుకోవాలన్నారు. నియోజకవర్గంలో మన పార్టీ బలంగా ఉన్నందున అందరూ కలిసి పనిచేస్తే విజయం తథ్యమన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను లక్ష్యంగా చేసుకొని తప్పుడు కేసులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఇబ్బంది పెట్టిన వారికి అసలు, వడ్డీతో చెల్లిస్తామని స్పష్టం చేశారు. తప్పుడు కేసులు పెట్టే పోలీసులు, ఇబ్బంది పెట్టే అధికారులును, టీడీపీ నేతల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఈ కమిటీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొండా రాజగోపాల్ రెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, ఎం.తిరుపతి నాయుడు, చెన్నకేశవులు, తిరుపతిరెడ్డి, సలీమ్, దస్తగిరి అహ్మద్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

వర్షం.. రోడ్లు జలమయం

నెల్లూరులోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం జోరు వాన కురిసింది. దీంతో అనేక రహదారులు జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. ఆత్మకూరు బస్టాండ్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వాహనాలను నెట్టుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

సండే మార్కెట్ ప్రాంతంలో ఇదీ పరిస్థితి





జలమయమైన నగరంలోని రోడ్డు



అండర్ బ్రిడ్జిలో వాహనాన్ని నెట్టుకుంటూ వెళ్తూ..



ఆత్మకూరు బస్టాండ్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇలా..



గాంధీబొమ్మ సెంటర్‌లో..

క్లుప్తంగా

ఉపాధిలో అవినీతిపై పునర్విచారణ

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అవినీతిపై పునర్విచారణకు ఆదేశిస్తూ కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. ఉపాధి పనుల్లో అవినీతిపై ఇటీవల చిన్నగోపవరం పంచాయతీలో చీఫ్ విజిలెన్స్ అధికారి సమగ్ర విచారణ చేశారు. ఎనిమిది మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అయితే డ్వామా అధికారులు మాత్రం ఆరుగురు సిబ్బందిపై కేసులు పెట్టి ఇద్దరు ఏపీఓలను తప్పించారు. ఈ వ్యవహారంలో అధికారులకు ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు రఘు నేరుగా జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మండలంలోని 20 పంచాయతీల్లో జరిగిన అవినీతిపై పునర్విచారణ చేపట్టాలని కమిషన్ ఆదేశించింది. దీంతో కలెక్టర్ సైతం పూర్తి స్థాయిలో పునర్విచారణ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో డ్వామా అధికారులు, ఉపాధి సిబ్బందిలో గుబులు మొదలైంది.

యువకుడి ఆత్మహత్య



యువకుడి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో తెలియదు గానీ క్షణికావేశంలో ఓ యువకుడు శబరి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెన్నానది ఎల్‌సీ గేటు సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. మృతుడి వయసు 25 నుంచి 30 ఏళ్ల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. నలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు నమోదు చేశారు. మృతుడిని వివరాలు తెలిసిన వారు తెలియజేయాలని ఆమె మంగళవారం విజ్ఞప్తి చేశారు.


నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.15

పేదింట ఉడకని కందిపప్పు

- సరఫరా చేయని కూటమి ప్రభుత్వం
- అంగన్‌వాడీలకే పంపిణీ
- మిగిలింది చౌక దుకాణాలకు..
- అక్కడి నుంచి నల్లబజారుకు తరలింపు



నెల్లూరు(పొగతోట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదింట కందిపప్పు ఉండకడం లేదు. చౌక దుకాణాలకు సరఫరా చేయకపోవడమే దీనికి ప్రధాన కారణం. కేవలం బియ్యం, చక్కెర మాత్రమే కార్డుదారులకు పంపిణీ చేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కేజీ కందిపప్పు రూ.160 నుంచి రూ.170 వరకు ఉంది. పేదలు అధిక మొత్తం వెచ్చించి కొనుగోలు చేయలేకపోతున్నారు. ఇటీవల దసరా పండగకు సైతం చంద్రబాబు సర్కారు పంపిణీ విషయాన్ని పట్టించుకోలేదు.

మిగిలింది మాత్రమే..

జిల్లాలో 7.21 లక్షల రేషన్ కార్డులున్నాయి. 1,513 చౌకదుకాణాల ద్వారా కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా కార్డుదారులకు కేజీ కందిపప్పు పంపిణీ చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఆయన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం కందిపప్పు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో 5 నుంచి 10 టన్నులు మిగులుతోంది. ఇది చెడిపోతుందని అతి తక్కువ రేషన్ షాపులకు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఇక్కడ కేజీ రూ.67కే విక్రయించాలి. కానీ బయట అధిక ధర ఉండటంతో డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేయకుండా నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న అధిక ధరలకు పాలకులు కళ్లెం వేయడం లేదు.

నిరాశ చెందుతూ..

చౌక దుకాణాల్లో ఇచ్చే రేషన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో కందిపప్పు సరఫరా చేయలేదు. లబ్ధిదారులు ప్రతి నెలా చౌక దుకాణాలకు వెళ్లి కందిపప్పు అడిగి నిరాశ చెందుతున్నారు.

సరఫరా చేయడం లేదు

చౌకదుకాణాల ద్వారా ప్రస్తుతం బియ్యం, చక్కెర మాత్రమే సరఫరా చేస్తున్నాం. కందిపప్పు పంపిణీ చేయడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా చేస్తున్నాం. వాటిలో మిగిలింది పురుగు పట్టకుండా అతి తక్కువ చౌకదుకాణాలకు పంపుతున్నాం. కందిపప్పును కార్డుదారులకు పంపిణీ చేయకుండా బహిరంగ మార్కెట్‌లో విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– అర్జున్‌రావు, పౌరసరఫరాల సంస్థ డీఎం

భూములు ఆక్రమిస్తున్నారు

- తహసీల్దార్‌కు మాజీ సైనికుల ఫిర్యాదు

దగదర్తి: తమకు ప్రభుత్వం కేటాయించిన భూమిని ఆక్రమిస్తున్నారని తహసీల్దార్ పి.కృష్ణకు మాజీ సైనికులు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా ఎంజీ లత, సూరిశెట్టి శేషయ్య దగదర్తి మండలంలోని దుండిగం గ్రామంలో భూమి కేటాయింపు పత్రాలు అందుకున్నారు. ఒక్కొక్కరికి మంజూరు చేసిన 3.45 ఎకరాలకు స్థానిక రెవెన్యూ అధికారులు హద్దులను ఏర్పాటు చేశారు. కొన్నిరోజుల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైనికులకు కేటాయించిన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. బాధితుల ఫిర్యాదుతో తహసీల్దార్ స్పందించి చర్యలు తీసుకోవాలని వీఆర్వోను ఆదేశించారు.

అయినా పట్టించుకోని ఆక్రమణదారుడు మళ్లీ భూమిని సాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని వీఆర్వో మంగళవారం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. మాజీ సైనికుల భూమిలో సాగు చేసేందుకు ప్రయత్నించిన వారిపై కేసు నమోదు చేస్తామని కృష్ణ హెచ్చరించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.128
లేయర్	: రూ.122
బ్రాయిలర్ చికెన్	: రూ.230
స్కిన్‌లెస్ చికెన్	: రూ.256
లేయర్ చికెన్	: రూ.207

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నెల్లూరు(లీగల్): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించడాన్ని ఖండిస్తూ ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) న్యాయవాదుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నెల్లూరులోని జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 'ఐలు' అధ్యక్ష, కార్యదర్శి సత్తు అంకయ్య, చుక్క రమేష్, ఐక్యవేదిక నాయకులు కుడుముల రవికుమార్, బద్దెపూడి రవీంద్ర, స్వర్ణ ప్రసాద్, నెల్లూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పద్మాకర్, లేడీ రిప్రజెంటేటివ్ లక్ష్మమ్మ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థలపై సనాతనం పేరుతో ఇలాంటి దుశ్చర్యకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వ పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వి.ఉపేంద్ర, పచ్చా కిరణ్, దేవరాల వెంకటేశ్వర్లు, సుధీర్, మోబీనా, కుమార్ రాజా, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో వాల్మీకి జయంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

కందుకూరు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతిని నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి రామాయణం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన బోధనలు నైతికంగా ఎదిగేందుకు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ హిమవంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో చోరీ

- మహిళ బ్యాగ్‌లోని 10 సవర్ల బంగారం అపహరణ



సీసీ కెమెరాలో నిక్షిప్తమైన నిందితుడి ఆనవాళ్లు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మహిళ బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు, నగదును దొంగ అపహరించుకెళ్లాడు. పోలీసుల కథనం మేరకు.. శెట్టిగుంటరోడ్డు వెంగమాంబ సెంటర్‌లో శైలజ, రామయ్య దంపతులు ఉంటున్నారు. శైలజ తల్లి మస్తానమ్మ సర్జరీ నిమిత్తం గత నెల 29వ తేదీన శ్రీనివాస అగ్రహారంలోని జీకే హాస్పిటల్లో చేరారు. ఆమె వద్ద కుమార్తె, అల్లుడు ఉంటున్నారు. ఇంట్లోని 10 సవర్ల బంగారు ఆభరణాలను శైలజ తీసుకొచ్చి ఆస్పత్రిలోని తన బ్యాగ్‌లో భద్రపరిచింది. మస్తానమ్మ ఆరోగ్యం కుదుటపడటంతో సోమవారం రాత్రి ఆస్పత్రి సిబ్బంది డిశ్చార్జ్ చేశారు. అయితే రాత్రి కావడంతో పక్కరోజు ఉదయం వెళ్లాలని నిర్ణయించుకుని నిద్రపోయారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగుడు వారి గదిలోకి ప్రవేశించి బ్యాగ్‌ను అపహరించాడు. నిద్ర లేచిన శైలజ బ్యాగ్ కనిపించకపోవడంతో అంతా గాలించింది. మొదటి అంతస్తులో బ్యాగ్ కిందపడి ఉంది. అందులోని 10 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.5 వేలు నగదు కనిపించకపోవడంతో యాజమాన్యానికి చెప్పింది. వారు సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా ఓ దుండగుడు శైలజ ఉన్న గదిలోకి ప్రవేశిస్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. బాధితురాలు బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై పుల్లారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): పోక్సో కేసులో నిందితుడిని నెల్లూరు సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. సంతపేట కామాక్షి నగర్‌కు చెందిన ఓ బాలిక పదో తరగతి చదువుతోంది. తోటపల్లిగూడూరు మండలానికి చెందిన శ్రీధర్ అలియాస్ శశి సంతపేటలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. అతను బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈనెల మూడో తేదీన బాలికను బాలాజీ నగర్‌లోని తన పిన్ని ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. అనంతరం ఆమెను మైపాడు బీచ్‌కు తీసుకెళ్లి సర్ది చెప్పి రాత్రి ఇంటికి సమీపంలో వదిలిపెట్టాడు. బాలిక ఆలస్యంగా ఇంటికి రావడంతో బాధిత కుటుంబం ప్రశ్నించగా అసలు విషయం చెప్పి ఆమె కన్నీటి పర్యంతమైంది. బాలిక అమ్మమ్మ 4వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు పోక్సో చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేశారు. మంగళవారం బాలాజీ నగర్ వద్ద అరెస్ట్ చేశారు.

ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని అడ్డుకుంటాం

- ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నేతలు



మహాసభలో పాల్గొన్న నాయకులు

నెల్లూరు సిటీ: 'కూటమి ప్రభుత్వం ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తోంది. దీనిని అడ్డుకుని తీరుతాం' అని ఏపీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి తెలిపారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఫెడరేషన్ 12వ జిల్లా మహాసభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీని ప్రైవేట్ వైపు తీసుకెళ్తోందన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ వారితో నడపాలని చూస్తున్నారన్నారు. ఈ ప్రయత్నాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రాధ్యక్షుడు సుందరయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలిందన్నారు. ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని, లేకపోతే ఐక్య కార్యాచరణ రూపొందించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని తెలిపారు. అనంతరం 17 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షుడిగా కృష్ణయ్య, అధ్యక్షుడిగా షేక్ షబ్బీర్, కార్యదర్శిగా డి.రమణయ్య కోశాధికారిగా ఎస్‌కే ఖాజావలీ వ్యవహరిస్తారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్, కట్టా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.